క్లుప్తంగా

రాజగోపుర రాతిగడపకు పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో దక్షిణ రాజగోపుర రాతి ముఖ ద్వారం గడపకు శుక్రవారం అర్చకులు రంగస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాతి గడపకు పూజలు చేశారు. ఈఓ వీరయ్య, సిబ్బంది రఘు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి



రోడ్డును పరిశీలిస్తున్న డీఈ శేషయ్య, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి

మద్దికెర: గ్రామాల్లో సీసీ రోడ్లు వేసే కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని పీఆర్ డీఈ శేషయ్య ఆదేశించారు. ఆయన శుక్రవారం మద్దికెరలోని పెద్ద నగరి వీధిలో జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, ఈఓ శివకుమార్, ఏఈలు విష్ణు, చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు బండారి ఆంజనేయులు, శ్రీనివాసులు ఉన్నారు.

3న సరస్వతీ మండపం వార్షికోత్సవం



పెరవలి జెడ్పీ పాఠశాలలోని సరస్వతి మండపం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982 బ్యాచ్ పదో తరగతి విద్యార్థి తలారి హనుమంతురావు రూ.15 లక్షలతో సరస్వతి మండపం నిర్మించి విగ్రహప్రతిష్ఠ చేసి ఆదర్శంగా నిలిచారు. విద్యార్థులు చదువుల తల్లికి దర్శించుకొని తరగతిలోకి ప్రవేశిస్తే మంచి భవిష్యత్తు, ఆధ్యాత్మికత అలవడుతుందనే భావనతో నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు. అలాగే పాలరాతితో చేసిన సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఏటా మాఘ మాసం పంచమి రోజున సరస్వతి పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరభ్యాసం చేసి పలకలు పంపిణీ చేసి పూజా కార్యక్రమాలకు విచ్చేసిన తల్లిదండ్రులకు, విద్యార్థులకు అన్నవితరణ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 3వ తేదీ పంచమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పన్నులు చెల్లించండి

హొళగుంద: హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీకి ప్రజలు 2024–25 సంవత్సరంతో పాటు పాత మొండి బకాయిలు, ఇతర అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ కోరారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు ఇంటి, కొళాయి పన్నులు, లైసెన్స్ రిన్యూవల్‌లు, బంకు ఎంక్రోచ్‌మెంట్ తదితర అన్ని రకాలు పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పన్నులు కట్టకపోతే కోర్టు నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మారెమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠ

దేవనకొండ: మండలంలోని గద్దెరాళ్ల గ్రామంలో శుక్రవారం మారెమ్మవ్వ విగ్రహాన్ని నూతనంగా నిర్మించిన ఆలయంలో పునరుద్ధరణ చేశారు. వేద పండితులు హోమంతో మొదలు పెట్టి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. గ్రామస్తులు, చుట్టుపక్కల పల్లెల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



విద్యార్థినులు తయారుచేసిన ప్రొటీన్ లడ్డూ ప్యాకెట్లతో హెచ్‌ఎం,ఈఎండీపీ నిర్వాహకులు

వెల్దుర్తి: విద్యార్థులు చదువుకునే వయసు నుంచే నూతన ఆవిష్కరణలపై మొగ్గు చూపుతూ పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూదేపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.వరలక్ష్మి సూచించారు. శుక్రవారం పాఠశాలలో ఈఎండీపీ కార్యక్రమం ఉపాధ్యాయురాలు ఎస్.నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. పాఠశాల 9వ తరగతి విద్యార్థినులు ప్రొటీన్ లడ్డూలను తయారు చేసి ప్రత్యేక ప్యాకింగ్‌తో అమ్మకానికి సిద్ధం చేశారు. పాఠశాలలో గత రెండేళ్లుగా ఈఎండీపీ కార్యక్రమ నిర్వహణ ద్వారా ఉపాధ్యాయురాలు నాగమణి ప్రశంసా పత్రం పొందారు.

తీర్మానం లేకుండా వేలంపై నిలదీత

- వాడీవేడిగా గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం
- సమస్యలపై నిలదీసిన సభ్యులు



మేజర్ గ్రామ పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న వార్డు సభ్యులు

ఆలూరు రూరల్: పంచాయతీ తీర్మానం లేకుండా గ్రామ పంచాయతీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ వేలాలు ఎలా నిర్వహిస్తారని వార్డు సభ్యులు సర్పంచ్ అరుణాదేవి, ఈఓ ప్రభాకర్‌ను ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అరుణా దేవి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ.. ఏడు నెలలుగా సమావేశం ఎందుకు నిర్వహించలేదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఎంత ఖర్చు చేశారని ప్రశ్నించారు. జనరల్ ఫండ్ లెక్కలు ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ నిధులు రూ.1,69,422, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2,30,000 ఉన్నాయని అధికారులు తెలిపారు. స్థానిక కోయనగర్ కాలనీలో కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు రూ.లక్షకు పైగా ఖర్చవుతుందని 3 నెలల కిందట తీర్మానం చేసినా ఇంతవరకు ఆమోదించలేదన్నారు. పాత బస్టాండులో ప్రయాణికులకు ఇబ్బందిమారిన కూరగాయల మార్కెట్‌ను వారపు సంత మార్కెట్‌లోకి మార్చాలని కోరారు. కార్మికుల జీతాల్లో కోత విధిస్తుండడంతో సక్రమంగా పనిచేయడం లేదని, గ్రామంలో పారిశుద్ధ్యం లోపించిందన్నారు. తాగునీటి సరఫరా సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కాలువల మరమ్మతులు చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వార్డు సభ్యులు అనీల్, జీరా గౌడ్, యశ్వంత్, వరుణ్, నీలమ్మ, జయశీలమ్మ సిబ్బంది వినోద్, వరుణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



నిట్రవట్టిలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ చక్రవర్తి

హాలహర్వి: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ చక్రవర్తి సూచించారు. మండలంలోని నిట్రవట్టి, హాలహర్వి గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు పని కల్పించినట్లు నిర్ధారిస్తూ పనిప్రదేశంలో రెండు సార్లు ఫొటోలు తీసినప్పుడే వారికి వేతనం జమ అవుతుందన్నారు. అడిగిన వారందరికీ పని కల్పిస్తామని, ఒకరికి బదులు మరొకరు రాకూడదన్నారు. ప్రతిఒక్కరూ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. ఎండలు పెరిగిపోవడంతో కూలీలు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల్లోపు పనులు పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

భజన పోటీల విజేత అలంపూర్

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన అంతర్రాష్ట్ర భజన పోటీల్లో తెలంగాణ రాష్ట్రం అలంపూర్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు శుక్రవారం సర్పంచ్ శంకరమ్మ, దాతలు, గ్రామ పెద్దలు బహుమతులను అందజేశారు. విజేత అలంపూర్ బృందానికి రూ.25 వేలు, తర్వాతిస్థానాల్లో నిలిచిన బృందాలు ముక్కెళ్లకు రూ.20 వేలు, వడ్లవానిపల్లెకు రూ.15 వేలు, శంకరాపురానికి రూ.11 వేలు, మడుగుపల్లెకు రూ.10 వేలు, గోవిందెన్నకు రూ.9 వేలు, హాలిగేరకు రూ.8 వేలు, తురువగల్లుకు రూ.6 వేలు, గోవపరాజుపల్లెకు రూ.5 వేలు, దొడగొండ జట్టుకు రూ.3 వేలు నగదు అందజేశారు. ఉత్తమ హార్మోనిస్టుగా శంకరాపురానికి చెందిన శ్రీనివాసరెడ్డి, ఉత్తమ తబలిస్టుగా వడ్లవానిపల్లెకు చెందిన బాషా, ఉత్తమ గాయకుడిగా సోమశేఖర్ రెడ్డి ఎంపికయ్యారు. వీరికి నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతిగా రూ.500 చొప్పున అందజేశారు.

నేటి నుంచి మెగా క్రికెట్ టోర్నీ



ప్రత్యేకంగా తయారు చేసిన క్రికెట్ పిచ్

పత్తికొండ రూరల్: పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం నుంచి 18 రోజుల పాటు మెగా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ కందనాతి సుంకన్న తెలిపారు. సౌత్ ఇండియా లెవెల్ –టి 20 క్రికెట్ టోర్నమెంట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ టోర్నీకి చెన్నై, బెంగళూరు, హోస్పేట్, బళ్లారి, హుబ్లీ, రాయచూర్, కొప్పాల్, నంద్యాల, గద్వాల, కర్నూలు, గుంతకల్లు, అనంతపురం, హిందూపురం, ఆదోని తదితర ప్రాంతాల నుంచి క్రీడాకారులు తరలిరానున్నారన్నారు. దాతల సహాయంతో టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచే విజేతలకు వరుసగా రూ.2,16,000, రూ.1,16,000, రూ.50,116 అందజేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలకు సిద్ధం చేశామన్నారు.

గృహ ప్రవేశాలు వాయిదా

తుగ్గలి: నియోజవర్గంలో 530 ఇళ్ల లబ్దిదారులతో గృహ ప్రవేశాలు చేయించే కార్యక్రమం వాయిదా పడింది. ఆయా మండలాల్లో శనివారం తలపెట్టిన గృహప్రవేశ కార్యక్రమం.. రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పక్కా గృహాలు మంజూరుకాగా లబ్దిదారులు నిర్మాణాలు చేపట్టారు. నిర్మాణాలు చివరి దశలో ఉండగా ప్రభుత్వం మారింది. నిర్మాణం పూర్తయిన ఇళ్లలో గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం నిర్వహించ తలపెట్టింది. ఈ క్రమంలో ప్రవేశాలు వాయిదా పడ్డాయి. మరోమారు కార్యక్రమం నిర్వహించి లబ్దిదారులకు గృహాలు అప్పగించనున్నట్లు హౌసింగ్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఇల్లు ఒకరికి.. బిల్లు మరొకరికి

- లబోదిబోమంటున్న పీఎంఏవై లబ్ధిదారుడు



పీ.కొత్తూరులో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇంటి వద్ద లబ్ధిదారుడు

తుగ్గలి: ఇల్లు ఒకరికి మంజూరైతే.. బిల్లు మరొకరి ఖాతాలో జమఅయింది. ఈ సమస్యను పరిష్కరిస్తానని చెప్పిన సచివాయల ఉద్యోగి ఏడాదిన్నర అవుతున్నా పట్టించుకోకపోవడంతో లబ్ధిదారుడు తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. మండల పరిధిలోని పి.కొత్తూరుకు చెందిన వలుకూరు సుంకన్నకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రెండేళ్ల క్రితం పక్కా ఇల్లు మంజూరైంది. లబ్ధిదారుడు ఇంటి నిర్మాణం చేపట్టి టాప్ లెవెల్ వరకు కట్టుకున్నాడు. అయితే, ఇంటి బిల్లు పక్క గ్రామానికి చెందిన మరొకరి అకౌంటు జమ అయింది. బిల్లు కోసం లబ్ధిదారుడు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరిబాబునాయక్‌ను సంప్రదించారు. ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేసి చివరకు పక్క గ్రామానికి చెందిన వ్యక్తి అకౌంట్‌లో బిల్లు జమ అయిందని తాపీగా చెప్పాడు. తర్వాత ఈ విషయం ఎక్కడ, ఎవరితో చెప్పొద్దని బిల్లు వచ్చేలా చూస్తానని నమ్మించి ఏడాదిన్నరగా తన చుట్టూ తిప్పించుకున్నాడు. ప్రస్తుతం పట్టించుకోకపోగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తుండటంతో లబ్ధిదారుడికి దిక్కుతోచడం లేదు. సమస్యను హౌసింగ్ అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లిన ఫలితం లేకపోయింది. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉద్దేశపూర్వకంగానే తనకు బిల్లు రాకుండా చేశారని లబ్ధిదారుడు ఆరోపిస్తున్నారు. రూ.8లక్షలకు పైగా అప్పులు చేసి ఇల్లు కట్టుకుంటున్నానని బిల్లు రాకపోవడంతో అది కూడా అసంపూర్తిగా నిలిచిపోయిందని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ స్పందించి తనకు బిల్లు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు. ఈ విషయమై హౌసింగ్ డీఈ విజయకుమార్‌ను సంప్రదించగా ఈ విషయం ఇటీవలే తనకు తెలిసిందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ జీర్ణోద్ధరణ



జీర్ణోద్ధరణ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: స్థానిక 1వ వార్డులోని పురాతన బాలాంజనేయ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు సంకల్పించి రూ.31 లక్షల విరాళం అందించిన మాజీ ఎంపీపీ దశరథరామిరెడ్డి, కుటుంబ సమేతంగా హోమాలు, కృతువులలో పాల్గొన్నారు. గణపతి పూజతో ప్రారంభమైన కార్యక్రమాలు కలశ స్థాపన, ప్రధాన దేవతావాహనం, అగ్ని ప్రతిష్టాపన, గణపతి, నవగ్రహ హోమాలు, మన్యు, కళాన్యాస, పరివార దేవతాహవనం, మంగళ నీరాజనం, కలశ ఉద్వాసనాలతో కొనసాగి తీర్థ ప్రసాద వితరణతో ముగిశాయి. నూతన దేవాలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. బాలాంజనేయస్వామి విగ్రహ, ప్రాణ కలశాన్ని సమీప పశువుల దేవాలయం (రాజరాజేశ్వర స్వామి ఆలయం)లో భద్రపరిచారు. పట్టణంతోపాటు, మండలంలోని వివిధ గ్రామాల పెద్దలు, పలువురు పీఠాధిపతులు పాల్గొన్నారు.

ఏపీజీబీ కార్యాలయం మార్పు

తుగ్గలి: స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును శుక్రవారం మరో భవనంలోకి మార్చారు. రీ కన్‌స్ట్రక్షన్ దృష్ట్యా ఇదివరకు ఉన్న భవనాన్ని సమీపంలోని చెన్నకేశవ స్వామి ఆలయం వెనుకకు మార్చారు. ఖాతాదారులు గమనించాలని మేనేజర్ శ్రీలత కోరారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

మద్దికెర: మండల పరిధిలోని హంప గ్రామానికి చెందిన గుజ్జుల కవిత (14) అనే విద్యార్థిని శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. బాలిక స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. గత కొంత కాలంగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో గుంతకల్లు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు హెచ్‌ఎం దేవేంద్రప్ప తెలిపారు. హంప గ్రామానికి చెందిన కవితకు పదేళ్ల క్రితమే తల్లిదండ్రులు సరస్వతి, సుధాకర్ చనిపోవడంతో అవ్వాతాతలు శాంతమ్మ, అంజినప్ప వద్ద ఉంటూ చదువుకుంటోంది. బాలిక మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఘనంగా ఆరాధనోత్సవం

కృష్ణగిరి: మండల పరిధిలోని సంగాల గ్రామంలో వెలసిన పెద్ద పుల్లయ్య స్వామి ఆరాధనోత్సవాన్ని శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం పుల్లయ్య దర్గాకు మేళతాళాల మధ్య గంధం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్గా వద్ద అన్నదాన కార్యక్రమాన్ని గిడ్డయ్యగౌడ్ తదితరులు నిర్వహించారు. రాత్రి భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమం నిర్వహించారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి



మాట్లాడుతున్న ఎస్.నాగరత్నమ్మ

పత్తికొండ రూరల్: ప్రజా సమస్యలను పరిష్కరించడంపైనే దృష్టి కేంద్రీకరిస్తామని పత్తికొండ మేజర్ గ్రామ పంచాయతీ గౌరవ సలహాదారురాలు ఎస్. నాగరత్నమ్మ, సర్పంచు కొమ్ము దీపిక అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈఓ నరసింహులు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు సమస్యలను వార్డు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణాలు చేపడతామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు లేనందున తీర్మానంలో ఉన్న సీసీ రోడ్లు, పైపులైన్, డ్రైనేజీ నిర్మాణాలు పనులు పూర్తిచేస్తే నిధులు మంజూరైన తరువాత బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఉపసర్పంచ్ కళావతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

7 నుంచి ఉరుసు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామ శివారులోని కొండపై వెలసిన దస్తగిరయ్య స్వామి ఉరుసును ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. 7న ఉదయం 9 గంటలకు నాగదేవత పూజ, 9:30 గంటలకు అభయ అంజనేయస్వామి పూజ, 10 గంటలకు పోతప్ప పూజతో ఉరుసును ప్రారంభించనున్నట్లు చెప్పారు. 8న తెల్లవారుజామున 4 గంటలకు గంధం , 9న తెల్లవారుజామున 4:30 గంటలకు షంషేర్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

కన్యకా పరమేశ్వరీ మాతకు పూజలు



పూజలందుకుంటున్న కన్యకా పరమేశ్వరీ మాత



ప్రత్యేక అలంకరణతో వాసవీదేవి

ఆస్పరి: ఆస్పరిలో వెలసిన కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం కన్యకా పరమేశ్వరీ మాత ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పూజారి పవన్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పల్లకీ సేవ, మంగళ హారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రశేఖర్, రఘు, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కర్నూలు – బళ్లారి రోడ్డు సమీపంలో అమ్మవారి ఆలయంలో అర్చకుడు మహేంద్ర ఆచార్ అష్టోత్తరాలను వల్లించారు. అంతకుముందు వాసవీదేవిని ఫల, పుష్ప అలంకరణ, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం పెద్దలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పత్తికొండ రూరల్: పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌ఆచారి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఈర్లదిన్నె రమేష్, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు ఈర్లదిన్నె మమత ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి 54 లీటర్ల పాలతో అభిషేకం నిర్వహించారు. రుద్రహోమం, దుర్గాహోమం, పూర్ణాహుతి తరువాత పుష్పార్చన, కుంకుమార్చన జరిపించారు. సాయంత్రం భక్తాదులు, మహిళామండలి ఆధ్వర్యంలో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

అక్రమంగా వీఓఏల నియామకం



పత్తికొండ ఎంపీడీఓ సువర్ణలతకు వినతి పత్రం ఇస్తున్న మహిళా ఐక్యవేదిక నాయకులు, పొదుపు సభ్యులు

పత్తికొండ రూరల్: అధికార పార్టీ నాయకుల రాజకీయ ఒత్తిడులతో వెలుగు అధికారులు అక్రమంగా వీఓఏల నియామకం చేపట్టారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద పొదుపు మహిళలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం పొదుపు గ్రూపులో ఉన్న మహిళలతో సమావేశం నిర్వహించి సభ్యుల ఆమోదంతో వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలన్నారు. మెజారిటీ సభ్యుల నిర్ణయం మేరకు గ్రామైక్య సంఘం లీడర్లను ఎన్నిక చేసి తీర్మానం కాపీని జిల్లా అధికారులకు పంపించకుండా స్థానిక అధికారులు అక్రమంగా ఇతర మండలాలకు చెందిన వారిని ఇక్కడ నియమించడం అన్యాయమన్నారు. దీనిపై విచారణ జరిపి పొదుపు మహిళలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ సువర్ణలతకు అందజేశారు.

దోమల నివారణకు ఫాగింగ్

హొళగుంద: మార్లమడికి గ్రామంలో సర్పంచ్ హరిజన యంకప్ప ఆధ్వర్యంలో ఆయా వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. ఇటీవల దోమల బెడద తీవ్రం కావడం, వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రతి రోజూ రాత్రి వీధుల్లో ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ యెంకప్ప తెలిపారు. అదేవిధంగా దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులు చెత్తచెదారం, మురుగు నీటిని వీధుల్లోకి వదలకుండా సహకరించాలని కోరారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం

పత్తికొండ(తుగ్గలి): పత్తికొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్దికెర మండలంలో గీత (ఈడిగ ఉప) కులాలకు కేటాయించిన ఒక మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోదలచిన వారు రూ.2 లక్షల రుసుం చెల్లించి ఫిబ్రవరి 5వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 7వ తేదీన డ్రా తీస్తారని వివరించారు.

వైభవంగా విగ్రహాల ఊరేగింపు



శ్రీమాళ సహిత మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తి

ఆలూరు: మండలంలోని అరికెర గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మాళ సహిత మల్లేశ్వరస్వామి విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ చేయనున్న సందర్భంగా శుక్రవారం సాయంత్రం మేళతాళాలతో ఆలయ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 101 మంది మహిళలు కలశాలతో పాల్గొనగా ఊరేగింపు నిర్వహించారు. నేడు ఉదయం గణపతి పూజ, పుణ్యావాహవాచనం, కంకణధారణ, ఆలయంపై కలశ స్థాపన, జలాధివాసం, అగ్నిప్రతిష్టాపన, దీక్ష, ధ్యానాదివాసం, నవగ్రహపూజ, అంకుర్పారణం, మహా మంగళహారతి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. భక్తులకు అన్నదానం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

హొళగుంద: 2024–25 సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ, కమ్మ, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాల కోసం సబ్సిడీ రుణాలు పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ విజయలలిత ఒక ప్రకటనలో సూచించారు. వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలు, పరిశ్రమలు, చిన్న తరహా వ్యాపారం, సేవలు, ట్రాన్స్‌పోర్ట్ తదితర వాటికి సంబంధించిన యూనిట్లకు సబ్సిడీ రుణాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. తెల్ల రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం , ఆధార్‌కార్డు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 7వ తేదీ లోగా ఏపీఓబీఎమ్ఎమ్ఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హోంగార్డు మానవత్వం



ఆవు వద్ద హోంగార్డు దానం, లేగదూడకు చికిత్స చేస్తున్న పశు వైద్య సిబ్బంది

వెల్దుర్తి: ఊరకుక్కల నుంచి ఆవును రక్షించి హోంగార్డు మానవత్వం చాటుకున్నారు. పట్టణ పరిధిలో తిరిగే ఆవు ఒకటి శుక్రవారం ప్రసవించింది. లేగదూడ భూమ్మీద పడి పడంగానే తల్లి ఆవు మాయతో కూడి ఉండడంతో ఊరకుక్కలు దాడికి తెగబడ్డాయి. అటుగా వచ్చిన హోంగార్డు దానం గమనించి ఊరకుక్కలను తరిమేశాడు. తల్లి ఆవు, లేగదూడ గాయాలపాలు కావడంతో స్థానిక పశు వైద్యశాలకు చేరుకుని సమాచారం అందించాడు. పశు వైద్య సిబ్బంది అక్కడికి చేరుకుని వైద్యం అందించగా కోలుకోలేక లేగదూడ మరణించింది. తల్లి ఆవు స్వల్ప గాయాలతో బయటపడింది. ఆవును మాత్రమే రక్షించగలిగానని లేగదూడను రక్షించలేకపోయానని హోంగార్డు దానం ఆవేదన వ్యక్తం చేశారు.

మంచి నీటి పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్



ములుగుందంలో పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టిన దృశ్యం

మండలంలోని ములుగుందం గ్రామంలో శుక్రవారం మంచి నీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. పైప్‌లైన్ లీకేజీపై జనవరి 30న 'లీకేజీతో వృథా.. నీటి కోసం వ్యథ' శీర్షికతో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి జంప్లానాయక్ పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టారు. – ఆస్పరి



పోతుగల్లు సమీపంలో మిరప పండును కోస్తున్న కూలీలు, కోసిన పండు మిర్చిని కుప్పలుగా పోస్తున్న దృశ్యం, పొలంలో ఆరబెట్టిన పండుమిర్చి

కోత కోసి.. కుప్పకేసి!

కృష్ణగిరి: మండలంలో ఎర్ర బంగారం (మిరప) పంట అత్యధికంగా సాగైంది. తేజ, బ్యాడిగ తదితర రకాల పంట వేశారు. ఎక్కువగా ఆగవేలి, సంగాల, పోతుగల్లు, పెనుమాడ, ఎరుకల చెర్వు, చుంచుఎర్రగుడి, చిట్యాల, కర్లకుంట తదితర గ్రామాల్లో ఈ ఏడాది దాదాపు వెయ్యి ఎకరాల్లో పంట సాగైంది. పంట ఖర్చుతో కూడుకున్నప్పటికీ రైతులు సాగుకే మొగ్గు చూపుతున్నారు. అయితే ఈ సంవత్సరం వాతావరణ ప్రభావంతో వైరస్ తదితర తెగుళ్లతో కొందరు పంటను మధ్యలోనే తొలగించి నష్టపోయారు. మిగిలిన రైతుల పంట ఇప్పుడిప్పుడే చేతికి వస్తుండటంతో పండు కాయలు కోసే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. మిరపను కోసి బయలు ప్రదేశాలు, బీడు పొలాల్లో ఆరబెడుతున్నారు.